

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



### మైతో ఆర్తీ ఉతారూరే సంతోషీమాతా కీ.

1975 వ సంవత్సరం హిందీ చలనచిత్ర రంగంలో మరుపురాని సంవత్సరం. మిలీనియం సూపర్ స్టార్ అమితాభ్ బచ్చన్ 'సూపర్‌స్టార్'గా స్థిరపడేందుకు దోహదం చేసిన సంవత్సరం అది. 'కల్ట్' సినిమాలుగా ప్రసిద్ధి పొందిన 'షోలే ', 'దీవార్'లు దేశాన్ని ఉర్రూతలూపిన సంవత్సరం అది. సినిమాలు ఫైట్లు, హింస, ప్రతీకారం వంటి వాటికి ఓ దశాబ్దం పాటు పరిమితమయ్యేందుకు కారణమైన సంవత్సరం అది. ఆ సంవత్సరంలో ఓ లో బడ్జెట్ సినిమా, ఎవరూ గుర్తుంచుకోని నటీనటులతో, అందరూ మరచిపోయిన సంగీత దర్శకుడితో కాలం చెల్లిన కథతో విడుదలయింది. మొత్తం దేశంలో 'భక్తి' భావన స్వరూపాన్ని మార్చి వేసింది. అంతవరకూ ఉత్తర భారతదేశంలో కొద్దిమందికి మాత్రమే పరిచయమైన 'సంతోషీ మాత' అనే పురాణంలో ప్రస్తావన లేని 'దేవత' దేశం నలుమూలలా పూజలందుకునేట్టు చేసింది ఆ సినిమా. శుక్రవారాలు పులుపు పదార్థాలు దేశం మొత్తం ఆడవాళ్లు తినటం మానేట్టు చేసింది ఆ సినిమా. ప్రజలకు కొత్త దేవుళ్లను అందించటంలో దేవతలకు విస్తృత ప్రచారం కల్పించటంలో సినిమా ప్రభావం, ముఖ్యంగా సినిమాల్లో భక్తిపాటల ప్రభావాన్ని తిరుగులేని రీతిలో నిరూపించిన సినిమా. 1975లో షోలే, దీవార్ వంటి 'గోలియత్'ల లాంటి సినిమాల నడుమ విడుదలై అనూహ్యమైనరీతిలో విజయం సాధించి, భారతీయ సమాజాన్ని తిరుగులేని రీతిలో ప్రభావం చేసిన 'డేవిడ్'లాంటి చిన్న సినిమా అయినా అత్యంత శక్తివంతమయిన సినిమా 'జై సంతోషీమా'. ఈ సినిమా అంతగా ప్రజాదరణ పొందటానికి దేశమంతా సంతోషీమాత – గుళ్లు వెలసిల్లటానికి కారణం వీధివీధినా, వాడవాడలా మార్మోగిన 'సంతోషిమాత' సినిమా పాటలు, ముఖ్యంగా భజన పాట 'మైతో ఆర్తీ ఉతారూరే సంతోషీ మాతాకీ' పాట. ఇదొక సినిమా భక్తిగీతం కాదు. సంతోషీమాత గుర్తింపు గీతం.'manifesto'లాంటిది. ఈ పాటను రచించింది కవి ప్రదీప్. సంగీత దర్శకత్వం వహించింది సి. అర్జున్. పాడింది ఉషా మంగేష్కర్. సంతోషిమాతాగా నటించింది అనిత గుహ.

ఈ సినిమాకు పనిచేసిన వారిలో ఒక్క కవి ప్రదీప్ తప్ప మరెవరూ సినీ రంగంలో విజయం చవిచూసిన వారు కారు. కానీ అంతా ప్రతిభావంతులయిన కళాకారులు. కానీ వారు సినీరంగంలో అదుగుపెట్టిన కాలంలో హిమాలయ శిఖరమంతటి ప్రతిభకలవారి నీడల్లో ఒదిగి పోవాల్సి వచ్చింది. సి. అర్జున్ చక్కటి పాటలను అందించాడు. జీవితాంతం 'సి గ్రేడ్' సినిమాలకే పరిమితమయినా, 'సి గ్రేడ్' సినిమాలకు 'ఎ ప్లస్' గ్రేడ్ పాటలను అందించాడు సి.అర్జున్. 'పాస్ బైఠో

తబీయత్ బహల్ జాయేగీ (పునర్మిలన్), 'గం కీ అంధేరి రాత్‌మే'(సుశీల) వంటి అత్యద్భుతమైన పాటలను రూపొందించాడు సి.అర్జున్. 'సంతోషిమాత' సినిమా షోలే, దీవార్ వంటి సినిమాలకన్నా ఘనవిజయం సాధించటం కేవలం సినిమాలోని పాటలవల్లే.

కవి ప్రదీప్‌కు భజనపాటలు, భక్తిగీతాలు రాయటం వెన్నతో పెట్టిన విద్య. శుద్ధ హిందీ పదాలు, అత్యంత సరళమైన భావం, సూటిగా గుండెల్లోకి దూసుకుపోయే రీతిగా రచించటం ఆయనకు అలవాటు. నిజానికి సంతోషిమాత సినిమాలో 'ఆరతి' పాట గతంలో నాస్తిక్ సినిమాలో రచించిన మరో అత్యద్భుతమైన భక్తినృత్యం గీతంలాంటిదే. ఆ పాట బాణీ, సంతోషీమాత పాట బాణీలకు దగ్గర పోలిక కూడా ఉంది. నాస్తిక్ సంగీత దర్శకుడు సి. రామచంద్ర.

**కాన్‌హా బజాయే బన్సురీ ఔర్ గ్వాలే బజాయే మంజీరే**

**ఓ గోపియా నాచే ఛమ్మక్ ఛం.**

గమనిస్తే అటూ సంతోషిమాత పాటలోనూ, ఈ పాటలోనూ వాడిన పదాలు చాలా సులభతరంగా అర్ధమవుతాయి. 'సంతోషీ మాతాకు హారతి ఇస్తున్నాను' అన్నది ఒక పాట అర్ధమయితే, కృష్ణుడు మురళి వాయిస్తున్నాడు. మంజీర అంటేచేతులతో తాళం వేసేది . కృష్ణుడు మురళి వాయిస్తూంటే, పాలు పెరుగు అమ్మే గ్రామీణ యువతలను 'గ్వాలన్' అంటారు. వారు తాళం వేస్తున్నారు. గోపికలు నృత్యం చేస్తున్నారు. ఇదీ నాస్తిక్ పాట భావం. ఎక్కడా ఎలాంటి సంక్లిష్ట సమాసాలు, పదబంధాలు లేకుండా సూటిగా, సరళమైన పదాలతో కళ్లముందు దృశ్యాలను నిలుపుతాడు కవి ప్రదీప్. ఒకచోట భక్తురాలు సంతోషిమాతకు హారతి ఇస్తోంది. ఇంకో చోట బృందావనంలో గోపికలు నృత్యం చేస్తున్నారు.

**బడీ మమతా హై బడా ప్యార్ మా కీ ఆంఖోమే**

**బడి కరుణా మాయా దులార్ మాకీ ఆంఖోమే**

**క్యూన్ నదేఖూ మై బారంబార్ మా కీ ఆంఖోమే**

**దిఖే హర్ ఘడీ చమత్కార్ ఆంఖోమే**

**నృత్య కరో ఝూం ఝూం, ఛం ఛమా ఛం ఝూం ఝూం**

**ఝూంకీ నిహారోరే!**

**జై జై సంతోషీమాత జైజై మాత!**

'జై సంతోషీమా' సినిమా ఆరంభంలో వస్తుందీ పాట. అంటే సంతోషీమాతను ప్రేక్షకులకు పరిచయం చేసే పాట అన్నమాట. సంతోషిమాత కరుణ కురిపించేమాత అని ఆమె గుణగణాలను, లక్షణాలను పరిచయం చేసేపాట. సినిమా అంతా ఆమె తన భక్తులను ఎలా రక్షిస్తుందో నిరూపిస్తుంది. ఆమె కళ్లల్లో మమత, కరుణ, వాత్సల్యం ఉట్టిపడుతూంటాయి. అందుకని ఆమె కళ్లనే చూస్తూంటాను. నృత్యం చేస్తూంటాను. ఆమె కళ్లల్లో చమత్కారం

కనిపిస్తుంది. ఇదీ ఈ చరణం సారంశం. ఏ దేవీ, దేవతకయినా ఈ వర్ణన సరిపోతుంది. కానీ సంతోషీమాత అని గుర్తుచేస్తూంటుంది పాట. బాణీ సులభంగా పట్టేస్తుంది. ఎందుకంటే, ఈ బాణీ దాదాపుగా నాస్తిక్ సినిమా పాట బాణీతో సరిపోతుంది.

**గోరే గోరే హాథోమే కంగ్‌నా ఖన్‌కే**
**కంగ్‌నా ఖన్‌కే హో కంగ్‌నా ఖన్‌కే**
**చంచల్ పావోం దేఖో పేంజానియా ఛన్‌కే**
**డోలక్ ధమాక్‌బోలే జార్ఘు భీ ఝూమాక్ బోలే**
**ధూం మచీ హై, ధూం మచీహై జమునా తీరే**
**హో గోపియా నాచే ఛమక్ ఛం...**

అదే సరళమైన వర్ణన. అత్యంత సరళమైన పదాలు. లయబద్ధమైన పదాలు. పలుకుతూంటేనే బాణీలోకి వచ్చేస్తాయి పదాలు. నృత్యం చేస్తున్న మహిళల గాజులు ఘల్లుమంటున్నాయి, కదిలే కాళ్లకున్న గజ్జెలు ఘల్లుమటున్నాయి. ఢోలక్ ధమ్మని మ్రోగుతోంది. లయ బద్ధంగా వెండి మంజీరాలు మ్రోగుతున్నాయి. వారి నృత్యంతో, వాయిద్యాల మ్రోతతో యమునా తీరం పరవశించిపోతోంది. గోపికలు నృత్యం చేస్తున్నారు. ఎలాగయితే గుణాలు, లక్షణాల వర్ణనతో కరుణ కురిసే సంతోషీమాత కళ్లను హృదయంలో నిలిపాడో, అలాగే యమునా తీరంలో గోపికలు నృత్యం చేస్తున్న మనోహరమైన దృశ్యాన్ని మనో నేత్రం ముందు నిలిపాడు.

**సదా హోతీ హై జై జైకార్ మాకీ మందిర్‌మే**
**నిత్ ఝూంఝుర్ కీ హోతీ హై ఝుంకార్ మాకీ మందిర్‌మే**
**సదా మంజీర్ కర్తే పుకార్ మాకీ మందిర్‌మే.**
**వరదాన్ కే భరే హై భండార్, మాకీ మందిర్ మే.**
**వరదాన్ కే భరే హై భండార్, మాకీఈ మందిర్ మే**
**హో దీప్ ధరో ధూప్ కరు, ప్రేమ సహిత్ భక్తి కరూ**
**హో జీవన్ సుధారో రే, హో ప్యారా ప్యారా జీవన్ సుధావోరే**
**మైతో ఆర్తీ ఉతారూరే, సంతోషీ మాతాకీ!**

సంతోషీమాతా మందిరంలో నిత్యం మంగళ వాయిద్యాలు మ్రోగుతూంటాయి. మాతా మందిరం వరదానాలు ఇచ్చే భాండాగారం. ధూపదీప నైవేద్యాలతో ప్రేమతో పూజిస్తే జీవితం మారుతుంది. సరైన దారిలో పడుతుంది. సంతోషిమాతాను పూజిస్తాను. ఈ పాట లయ ఎంత మధురమైనదంటే వింటూ ఊగిపోతాం. పాటలో పదాలు ఎంతో

తేలికగా అనిపించినా ఎంత శక్తివంతమయినవంటే మనసులో ఒక వరదాయిని అయిన కరుణామయ రూపాన్ని ప్రతిష్టిస్తాయి. దాంతో పాటలో పదాల భావాల శక్తి, బాణీ, లయ తోడయి, వాయిద్యాల కలయిక కలిగించే తన్మయత్వం తోడయి పాట వినేవాడు భక్తి భావంలో ఓలలాడతాడు. శరీరం భక్తిభావ తరంగాల తాకిడికి ఊగిపోతుంది. ఇదే బాణీతో ఉండే నాస్తిక్ పాట వింటూంటే కూడా అత్యంత శక్తివంతమైన భక్తి భావ తరంగాల తాకిడిని అనుభవిస్తాడు శ్రోత. దానికి నళిని జయవంత్‌తో సహా ఇతరుల నృత్యం తోడయి యమునా తరంగాల శృంగాలపై రాస కేళీవిలాస లయ కనుగుణంగా ఊగిపోతున్న భావన కలుగుతుంది.

**న తన్ కా ధ్యాన్ రహా, న మన్ కా ధ్యాన్ రే**
**నమన్ కా ధ్యాన్ రహా, న మన్ కా ధ్యాన్ రే.**
**ఆజ్ సభీ సుందరియా భూలీ హై భాన్ రే**
**సభి యోంకే సంగ్ సంగ్ ధన్‌క్ రహీహై మృదంగ్**
**పులికిత్ హై అంగ్ అంగ్ మన్‌మే ఉఛ్ లే తరంగ్**
**ఝూం ఝూం కామినియా జైసి హుయీ బావలీ**
**బాలోంకి లట్ ఉల్ ఝీ రే హో గోపియా నాచే ఛమక్ ఛం.**

అత్యద్భుతమైన గేయ రచన ఇది. పదాలు ఎంత లయబద్ధంగా ఉంటాయంటే పదాల అర్థాలు తెలియకున్నా భావం బోధ పడిపోతుంది. దృశ్యం, మామూలు దృశ్యం కాదు, పరమాద్భుతమూ, అత్యంత సుందరమూ, మనోరంజకమూ, మోహనకరమూ అయిన దృశ్యం కళ్లముందు నిలుస్తుంది. మనస్సు, పాటలో చెప్పినట్టు 'పులికిత హై అంగ్ అంగ్, మన్ మే ఉఛ్ లే తరంగ్' అవుతుంది. అణువణువూ పులికితమై మనస్సులో అలలు ఎగసి ఎగసి పడతాయి. తెరపై దృశ్యం కూడా అద్భుతంగా ఉంది. 'న తన్ కా ధాన్' అన్నప్పుడు క్లోజప్పులో నళినీ జయవంత వదనం మత్తు నిండిన కళ్లతో, నిజానికి అది భక్తి జనిత మనోహరమైన మత్తు, కనిపిస్తూంటే నిజంగానే 'న తన్ కా ధాన్ , న మన్ కా ధ్యాన్ రే' అనిపిస్తుంది. మనమూ ఆ అందమైన గోపికల లయబద్ధమైన నృత్యంలో భాగమైపోయినట్టు అనిపిస్తుంది. మనమూ ఊగిపోతాం. ముఖ్యంగా 'మన్ మే ఉఛ్ లే తరంగ్' అన్నప్పుడు అలల్లా కదులుతూంటే, అలల శృంగాలపై నృత్యం చేసే సూర్యకిరణాలు గుర్తుకు వస్తాయి. లత స్వరం తీగలా బాణీ మెలికలతో పాటూ పోతూ మనల్ని యమునా తీరంలో రాసలీల నడుమ నిలుపుతుంది.

గమనిస్తే 'జై జై సంతోషిమా' పాటలో కన్నా ఈ పాటలోని పదాలలో ఒక సొగసు ఉంది. రెండు పాటలలోని పదాలు స్వచ్ఛమైన హిందీ పదాలే అయినా, 'కాన్‌హా బజాయే' పాటలోని పదాలలో ఊపు ఉంది. లయ ఉంది. పదాలు నృత్యం చేయటం అంటే ఏమిటో అనుభవానికి వస్తుంది. 'సఖియోంకె సంగ్ సంగ్ ధన క్ రహీ హై మృదంగ్, పులకిత్

హై అంగ్ అంగ్, మన్‌మే ఉఛ్ లే తరంగ్' పదాలు పలుకుతూంటేనే మనస్సులో మృదంగాలు మ్రోగుతాయి. కాలి అందెల రవళులు ఊగుతాయి. మనస్సు, శరీరం యమునా తరంగాలపై ఆడతాయి.

**ఛాయా బృందావన్ మే ఆజ్ అజబ్ రంగ్ హై**
**ధర్తీ వృందావన్ మే ఆజ్ అజాబ్ దంగ్ హై**
**కైసా హై యే కమాల్, దశోదిశాయే నిహాల్**
**జమునా దేతి హై తాల్ ఉడ్నే లగీ వైఘ్మాల్**
**ఝూమునే లగీ డాల్ డాల్, థం గయీ పవన్‌కి చాల్**
**బారా ఘోడోవాలా సూరజ్ కా రథ్ భి**
**చల్నే లగేరే ధీరే ధీరే, హో గోపియా నాచే ఛమక్ ఛం!**

యమునా నది తీరంలో సాగుతున్న రాసక్రీడను చూసి యమునా నది లయబద్ధంగా ఊగుతోంది. ప్రతికొమ్మ నృత్యం చేస్తోంది. గాలి వీయటం మరచి స్థంభించి పోయింది. సూర్యుడి రథంకూడా వేగం తగ్గి నిలచిపోయింది. సర్వసృష్టి చైతన్యం తొణికిసలాడే రీతిలో స్థబ్దమై ఈ దృశ్యం చూస్తోంది. ఆనందిస్తోంది. కాలం స్థంభించి పోయిందన్నమాట. తెరపై నృత్యం, పాట, లయ నిజంగానే కాలాన్ని స్థంభింపచేస్తుంది. ఎన్ని మార్లు విన్నా తనివి తీరదు. ఎన్నిమార్లు చూసినా తనివి తీరదు. నిజంగా ఈ పాట చూస్తూంటే, కృష్ణుడి తలపే ఇంత మైమరపు, ఇంత ఆనందం, ఇంత అద్భుతం అయితే, ఆ కాలంలో బృందావనం ఎంత అలౌకికంగా ఉండి ఉంటుందో కదా! నిజానికీ పాటలో కృష్ణుడే కనబడదు. అంతా గోపికలే!. అక్కడి ప్రతి కణ కణం ఎంత పవిత్రమో, ఎంత లయమయమో అనిపిస్తుంది. అయితే ఇలాంటి ఊహలతో ఇప్పటి బృందావనానికి వెళ్తే నిరాశ ఎదురవుతుంది. అలనాటి వేణుగాన మధురిమలు, చెలరేగిన మురళీ సుధల తలపులు ఏవీ అక్కడ కనిపించవు. కానీ ఆ భావనను మనకు అనుభూతి తెచ్చి ఉత్రూతలూగింపచేస్తుందీ పాట. ఆనాటి బృందావన రాసకేళీవిలాసంలో భాగం పంచుకోలేని మన దౌర్భాగ్యాన్ని కొంచమయినా తగ్గిస్తుంది ఈ పాట.

అయితే 'మైతో ఆర్తీ ఊతారూ రే' పాట దేశానికి సంతోషీమాత భక్తిని నేర్పింది. కానీ 'నాస్తిక్' పాట సినిమాలోని ఇతర అద్భుతమైన పాటలలో ఒకటిగా మిగిలిపోయింది. దీనికి కారణం ఆలోచిస్తే, సంతోషీమాత సినిమాకు ఈ పాట కేంద్రం వంటిది. సినిమా సారం వంటిది. కాబట్టి దృష్టి ఈపాట పైనే ఉంటుంది. 'నాస్తిక్' సినిమాలో పాట సినిమా కథను ముందుకు తోయటంలో ఒక భాగం. నాయకుడు తాను చంపాలనుకున్న వ్యక్తిని చూడటంపైన ప్రేక్షకుడి దృష్టి ఉంటుంది. నాయికకూ నాయకుడికీ ఉన్న అనుబంధం, ఆమె తండ్రినే నాయకుడు చంపాలని అనుకోవటం వంటి వాటివైపు ప్రేక్షకుడి దృష్టి మళ్లుతుంది. దాంతో పాటభావం, నృత్యం వంటివి ప్రేక్షకుడు అనుభవిస్తాడు కానీ దృష్టి సంపూర్ణంగా పాటపై ఉండదు.

'జై సంతోషీమా' సినిమాలో 'మదద్ కరో సంతోషీ మా' అనే మరో పాట వీధి వీధి, వాడ వాడనా మారు మ్రోగింది. ఆ పాటతో పాటు కవి ప్రదీప్ రచించి , మహేంద్ర కపూర్‌తో పాడిన పాట అయితే పురాణాలలో లేని సంతోషిమాతాకు పురాణ గౌరవం కల్పించింది.

**యహా వహా జహా తహా పూఛో కహా కహా హై సంతోషీ మా!**
**అప్‌నీ సంతోషీ మా, అప్నీ సంతోషీమా**
**జల్ మెభీ థల్ మేభీ, చల్‌మేభీ, అతల్, వితల్ మేభీ మా!**

అంటూ సృష్టిలోని అణువణువునా సంతోషీమా ఉందని చెప్తుంది ఈ పాట. అంబ, జగదాంబ శక్తి అంటూ సంతోషీమాతను పురాణ దేవతల్తో పోలుస్తాడు కవి ప్రదీప్.

**గౌరీ సుత గణపతికీ బేటీ, యే హై బడీ భోలీ**
**దేఖ్ దేఖ్ కర్ ఇస్‌కా ముఖేడా హర్ ఇక్ దిశాడోలీ**
**ఆవోరే భక్త్ యే మాతాహై, సచ్‌కీ హం జోలీ**
**జో మాంగేంగే తుమ్హే మిలేగీ, భర్‌లో ఝోలీ,**
**ఉజ్జ్వల్ ఉజ్జ్వ ల్, నిర్మల్ నిర్మల్, సుందర్ సుందర్ మా...**

గౌరీ సుతుడయిన గణపతి సుత సంతోషీమాత. ఆమె సుందర వదనం చూస్తూ దిశలన్నీ సంతోషిస్తాయి. భక్తులు కోరిన కోరికలను తీరుస్తుంది. అడిగింది ఇస్తుంది. రండి భక్తులారా అంటూ కవి ప్రదీప్ ఆహ్వానించటంతో తండోపతండాలుగా దేశం నలుమూలలా ప్రజలు సంతోషీమాతా భక్తులయిపోయారు. దేశం నలుమూలలా సంతోషిమాత ఆలయాలు వెలశాయి. శుక్రవారం వ్రతాలు సర్వసాధారణమయ్యాయి. సంతోషిమాత సినిమా ఘనవిజయం సాధించటం సినీ విశ్లేషకులను, పండితులను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

షోలే, దీవార్ వంటి 'హిట్' సినిమాలను దాటి ఒక సి గ్రేడ్ సినిమా విజయం సాధించటం, ప్రజలను ఉద్రూతలూగించటం గురించి ఈనాటికీ విశ్లేషణలు సాగుతున్నాయి. సంతోషీమాత చిత్ర నిర్మాణంలో పాల్గొన్న వారంతా కొంతకాలానికి ఆశ్చర్యకరంగా మరణం పాలవటం కూడా సినిమాపై ఆసక్తిని పెంచటంలో తోడ్పడింది. అయితే, సంతోషిమాత సినిమా విజయం , సినిమా ఏ రీతిలో సమాజాన్ని ప్రభావితం చేయగలదో నిర్ణయాత్మకంగా నిరూపించింది. అంతేకాదు, ప్రజలలో భక్తిభావాన్ని కలిగించేందుకు సినిమా తిరుగులేని సాధనం అన్న సత్యం బోధపరచింది. దాంతో షిర్డీ సాయిబాబాను ప్రజలకు చేరువ చేసేందుకు 1977లో 'షిర్డీ సాయిబాబా' సినిమా నిర్మించారు. 'సాయిబాబా బోలో', సాయిబాబా 'తేరే హజారో హాథ్' వంటి పాటలతో షిర్డీ సాయిబాబా భక్తి ప్రజలలో విస్తరించింది. 'అమర్ అక్బర్

ఆంధోనీ'లోని 'షిర్డివాలే, సాయిబాబా' పాటతో సాయిబాబా భక్తి సమాజంలో ఉచ్ఛస్థాయికి చేరుకుంది. 'షిర్డీ ' అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చింది.

ఇదే దారిని అనుసరిస్తూ 'వైష్ణో దేవి' భక్తి పాటలు కూడా వైష్ణవదేవి యాత్రకు దేశవ్యాప్తంగా ప్రజలను పురికొల్పాయి. వైష్ణోదేవి ప్రధాన పర్యాటక స్థలాల్లో ఒకటయింది. ముఖ్యంగా నరేంద్ర చంచల్ పాటలు 'చలో బులావా ఆయాహై', 'తూనే ముఝే బలాయా షేరా వాలియే ' వంటివి వైష్ణోదేవి భక్తి తరంగాలలో ప్రజలను ఓలలాడించాయి.

ఇంతలో మళ్లీ హిందీ సినిమాలలో ప్రేమ 'మైనే ప్యార్ కియా', 'ఖయామత్ సే కయామత్ తక్' వంటి సినిమాలతో మధురమైన పాటల ద్వార పునః ప్రవేశించింది. దాంతో భక్తిపాటలు సినిమాలలోంచి తెర వెనక్కు వెళ్లిపోయాయి. అంటే, 1970 దశకంలో సినిమాలలోంచి సున్నితత్వం అంతమయి, హింస, ఆవేశం పగలు, ప్రతీకారాలు పెద్ద ఎత్తున ప్రవేశించాయో, సమాజంలో నిరాశ నిస్పృహలు పెరిగి, అభద్రతా భావం, అనిశ్చింతతలు పెరిగాయో, ఆ సమయంలో ప్రజలకు 'భక్తి' ఉపశమనం ఇచ్చిందన్నమాట. సంతోషిమాత, షిర్డీ సాయిబాబ, వైష్ణోదేవి వంటి దేవతల భక్తి సినీ పాటల రూపంలో ప్రజలకు ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చి శీతల పవనాలు వీయించాయన్నమాట. మళ్లీ సమాజంలో ఆర్థిక సంస్కరణల పవనాలు వీయటం ఆరంభించి, దిశమారిందో, అప్పుడు ప్రేమ రంగ ప్రవేశం చేసింది. భక్తి వ్యాపార భావనగా మారింది. భక్తి ప్రైవేట్ భజన గీతాలకు పరిమితమయింది. సినిమాల్లోంచి భక్తిగీతాలు దాదాపుగా అదృశ్యమయ్యాయి. ఇటీవలి 'కేదార్' సినిమాలో శివ ప్రస్తుతి గీతం ఒకటి ఉంది. అమితాబ్ భట్టాచార్య రాసిన ఈ పాటను అమిత్ త్రివేది అత్యంత ఉత్సాహంగా పాడారు.

**జైహో జై హో శంకరా, బోలే నాథ్ శంకరా**
**ఆది దేవ శంకర, తేరే జాప్ కే బినా**
**చలే యే సాంస్ కిస్ తరహా?**

ఇటీవలి కాలంలో వచ్చిన చక్కని భక్తి గీతాలలో ఇదొకటి. పాట చిత్రీకరణ కూడా అందంగా ఉంటుంది. ఇంకా అనేక విభిన్నమైన విశిష్టమైన భక్తి గీతాలు మన సినిమాలను అలంకరించాయి. సమాజాన్ని భక్తి రసప్రవాహంతో పవిత్రం చేశాయి.

అయితే భక్తిగీతాలకు కాస్త విరామం ఇచ్చి వచ్చే నెలనుంచి కొన్ని హాస్య సినీ గీతాలను పలకరిద్దాం 'మ్యూజికల్ మ్యూజింగ్స్'లో.

Post your comments